సాక్షి ప్రకాశం

శుక్రవారం | 14 | ఏప్రిల్ | 2023



మైనార్టీల సంక్షేమానికి పెద్ద పీట

మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసిందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అన్నారు. - 8లో..



రామచంద్రునిగా చెన్నకేశవుడు

మార్కాపురంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారు హనుమంత వాహనంపై శ్రీ రామచంద్రుని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
39 /26

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వాతావరణంలో తేమ శాతం అధికం. ఉక్కపోతగా ఉంటుంది.



శతాబ్దాల కల..
సాకారం దిశగా...

బ్రిటీష్ కాలం నాటి రోడ్డుకు మోక్షం కలిగింది. ఏళ్లు గడుస్తున్నా ఈ రోడ్డు దుస్థితిని పట్టించుకున్న వారే లేరు. కనిగిరి నుంచి కందుకూరు పట్టణానికి 49 కిలోమీటర్లు ప్రయాణించేందుకు దాదాపు 2.30 గంటలు పడుతోంది. ప్రయాణికుల అవస్థలు వర్ణనాతీతం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రోడ్డుకు మహర్దశ పట్టింది. కనిగిరి ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ ప్రత్యేక దృష్టి సారించడంతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.



నిర్మాణంలో ఉన్న కనిగిరి - కందుకూరు డబుల్ రోడ్డు

- శరవేగంగా కనిగిరి - కందుకూరు రోడ్డు నిర్మాణం
- రూ.18 కోట్లతో డబుల్ రోడ్డు
- చివరి దశలో పనులు
- తీరనున్న మూడు నియోజకవర్గాల చిరకాల రోడ్డు సమస్య
- తగ్గనున్న ప్రయాణ సమయం
- కొనసాగుతున్న రూ.100.27 కోట్ల రోడ్డు నిర్మాణ పనులు

కనిగిరి రూరల్: కనిగిరి - కందుకూరు రోడ్డు నిర్మాణం పూర్తి కావస్తుండటంతో ప్రయాణికుల కష్టాలకు చెక్ పడనుంది. ఇటీవల జరిగిన జిల్లాల విభజనలో కందుకూరు పట్టణం నెల్లూరు జిల్లాలోకి వెళ్లినప్పటికీ.. ఈ రోడ్డు కనిగిరి, కందుకూరు, కొండపి నియోజకవర్గాలకు అనుసంధానంగా ఉంది. ఇప్పటివరకు ఉన్న 49 కి.మీ.ల కనిగిరి - కందుకూరు సింగిల్ రోడ్డు బ్రిటీష్ కాలం నాటిది. అడుగడుగునా గోతులు, గుంతల మయం కావడంతో ప్రయాణం నరకయాతనగా మారింది. రోడ్డంతా ఛిద్రంగా మారి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. కనిగిరి ప్రజలు కందుకూరు, సింగరాయకొండ, నెల్లూరు వెళ్లాలంటే పడే అవస్థలు వర్ణనాతీతం. ఇటువంటి దయనీయ స్థితిలో ఉన్న రోడ్డుకు మోక్షం కలిగించేందుకు కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ దృష్టి సారించారు. సమస్య తీవ్రతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేశారు. ఆ మేరకు వివిధ గ్రాంట్ల కింద ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. పాత రోడ్డు అభివృద్ధితో పాటు సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మారుస్తూ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతుండటంతో మూడు నియోజకవర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తగ్గనున్న ప్రయాణం..

కనిగిరి ప్రాంత ప్రజలు ఎక్కువగా కందుకూరు వైపు ప్రయాణాలు సాగిస్తుంటారు. సింగరాయకొండ హైవే ఎక్కితే ఇటు ఒంగోలు, అటు నెల్లూరు రెండు జిల్లాల కేంద్రాలకు ప్రయాణం సులువుగా ఉంటుంది. కానీ, రోడ్డు అధ్వానంగా ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడటమే కాకుండా వాహన చోదకులు సైతం ఈ రోడ్డులో ప్రయాణం సాగించేందుకు ఇష్టపడరు. అంతేగాకుండా ప్రయాణ సమయం విషయానికొస్తే ఎంత నెమ్మదిగా వెళ్లిన 1.45 గంటల్లో కనిగిరి నుంచి కందుకూరు చేరవచ్చు. కానీ, రోడ్డు బాగలేనందున ఆర్టీసీ బస్సులో 2.15 నిమిషాలు, ప్రైవేటు వాహనాల్లో 2 గంటల వరకు పడుతోంది. ప్రస్తుతం రోడ్డు నిర్మాణంతో ప్రయాణ సమయం బాగా తగ్గనుంది. కిలోమీటర్లు తగ్గకపోయినా, డబుల్ రోడ్డు నిర్మిస్తుండటంతో ఆర్టీసీ బస్సులో 1.30 గంట, ప్రైవేటు వాహనాల్లో 1.15 నిమిషాల్లో కందుకూరు చేరవచ్చని వాహన చోదకులు చెబుతున్నారు. దీంతో సమయం కలిసి రావడంతో పాటు ప్రయాణం సులువుగా సాగే అవకాశం ఉంది.

శరవేగంగా రూ.100.27 కోట్ల ఓవీ రోడ్డు నిర్మాణ పనులు...

రూ.100.27 కోట్లతో ఊళ్లపాలెం నుంచి వేములపాడు వరకు చేపట్టిన డబుల్ రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. న్యూ డవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డీబీ) గ్రాంట్ కింద 55 కి.మీ.ల దూరం బిట్లుబిట్లుగా సాగే ఈ రోడ్డు నిర్మాణ పనుల్లో సుమారు 57 బ్రిడ్జిలు, చప్టాలు నిర్మించాల్సి ఉంది. కనిగిరి, కందుకూరు, కొండపి నియోజకవర్గాల పరిధిలో రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఇందులో అత్యధికంగా కనిగిరి నియోజకవర్గంలోని మూడు మండలాలకు ఉపయోగం కలగనుంది. కనిగిరి, పీసీ పల్లి, హెచ్ఎం పాడు మండలాలకు అనుసంధానంగా రోడ్డు సాగనుంది. ఆ మేరకు కనిగిరి నుంచి కందుకూరు రోడ్డు పరిధిలో నిర్మాణ పనులు జరుగుతుండగా, కనిగిరి నుంచి వేములపాడు రోడ్డు పరిధిలో భారీ బ్రిడ్జి పనులు సాగుతున్నాయి. మూడు బ్రిడ్జిల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఇవే కాకుండా కనిగిరి నియోజకవర్గంలో సీఎస్ పురం నుంచి మాలకొండ వరకు సుమారు 62 కి.మీ.ల దూరం గల రోడ్డును రూ.430 కోట్లతో ఎస్‌హెచ్ (ఓ) నిర్మిస్తున్నారు.

చివరి దశలో పనులు...

ఓవీ రోడ్డు పరిధిలో రూ.18 కోట్ల సెంట్రల్ రోడ్ ఫండ్ (సీఆర్ఎఫ్ గ్రాంట్)తో జరుగుతున్న పనులు దాదాపు చివరి దశకు వచ్చాయి. సింగరాయకొండ నుంచి కనిగిరి వరకు వివిధ ప్రాంతాల్లో 18 కి.మీ.ల దూరం గల రోడ్డు నిర్మాణం జరుగుతోంది. కనిగిరి, కందుకూరు ఏరియాల్లో చివరిగా రెండు బ్రిడ్జిల నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. రెండు వారాల్లో పనులు పూర్తి కానున్నాయి.

సీఎం సహకారంతో మరింత అభివృద్ధి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీసులు, సహకారంతో కనిగిరిని మరింత అభివృద్ధి చేస్తాం. దశాబ్దాల కాలం నాటి కనిగిరి - కందుకూరు సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా మారుస్తున్నాం. రూ.100 కోట్ల ఎన్‌డీబీ, రూ.18 కోట్ల సీఆర్ఎఫ్ గ్రాంట్‌తో రోడ్డు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. అలాగే ఎస్‌హెచ్ (ఓ) కింద సుమారు రూ.430 కోట్లతో 62 కి.మీల దూరం గల రోడ్డు నిర్మాణ పనులు కనిగిరి నియోజకవర్గంలో మంజూరై పురోగతిలో ఉన్నాయి. కడప, నెల్లూరు బోర్డర్ నుంచి ప్రకాశం జిల్లా సీఎస్ పురం వరకు ఒక ప్యాకేజీ కింద 20 కి.మీ.ల దూరం, రెండో ప్యాకేజీ కింద సీఎస్ పురం నుంచి మాలకొండ వరకు సుమారు 42 కి.మీ.ల దూరం ఎస్‌హెచ్ (ఓ) రోడ్డు పనులు చేస్తున్నారు. వీటితో పాటు నియోజకవర్గంలో ప్రధాన రోడ్ల సమస్యలన్నీ పరిష్కరిస్తాం.

– బుర్రా మధుసూదన్‌యాదవ్, కనిగిరి ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు



కనిగిరి - కందుకూరు రోడ్డులో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి



ఎన్‌హెచ్‌వో కింద నిర్మిస్తున్న సీఎస్ పురం - మాలకొండ రోడ్డు



కనిగిరి - వేములపాడు రోడ్డులో నిర్మిస్తున్న బ్రిడ్జి

న్యూస్‌రీల్

పొగాకు రైతుల సమస్యలు పరిష్కరిస్తా



పొగాకు రైతులతో మాట్లాడుతున్న బోర్డు ఈడీ శ్రీధర్‌బాబు

మద్దిపాడు: పొగాకు రైతుల సమస్యలు పరిష్కరిస్తానని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు అన్నారు. మద్దిపాడు మండలంలోని వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బ్రైట్ రకం పొగాకు, లో గ్రేడ్ పొగాకుకు రేటు వ్యత్యాసం అతి తక్కువగా ఉందని, మేలిమి రకం పొగాకుకు మంచి ధర ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. స్పందించిన ఈడీ మాట్లాడుతూ.. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పొగాకుకు కంపెనీలు ధర పెంచడం సాధారణంగా జరుగుతుందన్నారు. అందువలన మార్కెట్ ఎత్తుగడల ప్రకారం వ్యత్యాసాలు వస్తున్నాయన్నారు. దీనిని పరిష్కరించడానికి మార్గం చూస్తున్నామన్నారు. అనంతరం నూతనంగా ఏర్పాటు చేసిన వేలం కేంద్రాన్ని ఆయన పరిశీలించి అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ముందుగా భారత పొగాకు బోర్డు సభ్యులు మారెడ్డి సుబ్బారెడ్డి, పొద వరప్రసాద్, బొడ్డపాటి బ్రహ్మయ్యలు బొకేలిచ్చి ఈడీని సన్మానించారు. అనంతరం పొగాకు వేలం జరుగుతున్న తీరును ఈడీ పరిశీలించారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు సెక్రటరీ వేణుగోపాల్, ఆర్ఎం లక్ష్మణరావు, ఏఎస్ సత్యశ్రీనివాస్, ఐటీసీ లీఫ్ మేనేజర్ శివకుమార్, జీపీఐ లీఫ్ మేనేజర్ ప్రభాకర్, ఫ్లోర్ రైతు సంఘ నాయకులు శేషగిరి, మహేష్, వరహాలు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నేడు అంబేడ్కర్ జయంతి

ఒంగోలు: స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జి.దేవప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సైన్స్ పరీక్షకు 239 మంది గైర్హాజరు

ఒంగోలు: పదో తరగతి సైన్స్ పరీక్ష గురువారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలోని 38 మండలాల నుంచి 29,089 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 239 మంది గైర్హాజరయ్యారు. 28,850 మంది మాత్రమే హాజరయ్యారు. ప్రభుత్వ పరీక్షల పరిశీలకుడు డాక్టర్ ఎంఆర్ ప్రసన్నకుమార్ 9 సెంటర్లను తనిఖీ చేశారు. స్క్వాడ్ బృందాలు 61 కేంద్రాలను, డీఈవో నాలుగు కేంద్రాలను తనిఖీ చేశారు.

ఓపెన్ స్కూల్ పరీక్షకు 404 మంది గైర్హాజరు...

ఓపెన్ స్కూల్ పరీక్షకు గురువారం 404 మంది గైర్హాజరయ్యారు. పదో తరగతి సైన్స్ పరీక్షకు 1,667 మందికిగానూ 1,414 మంది హాజరయ్యారు. ఇంటర్ ఫిజిక్స్ పరీక్షకు 2,940 మందికిగానూ 2,716 మంది, పొలిటికల్ సైన్స్ పరీక్షకు 1,549 మందికిగానూ 1,369 మంది హాజరయ్యారు. సింగరాయకొండలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలకుడు ప్రసన్నకుమార్ తనిఖీ చేయగా, డీఈవో, జిల్లా కో ఆర్డినేటర్ కనిగిరిలోని పరీక్ష కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రీజనల్ కో ఆర్డినేటర్ భూమన కరుణాకర్‌రెడ్డి, పక్కన పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి

- వైఎస్సార్ సీపీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేయాలి
- పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్లు భూమన కరుణాకర్‌రెడ్డి, ఎంపీ బీద మస్తాన్‌రావు పిలుపు
- దర్శిలో నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం

దర్శి టౌన్: వైఎస్సార్ సీపీ శ్రేణులంతా సమన్వయంతో పనిచేసి పార్టీని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని ఆ పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్లు భూమన కరుణాకర్‌రెడ్డి, ఎంపీ బీద మస్తాన్‌రావు పిలుపునిచ్చారు. దర్శిలోని ఎమ్మెల్యే కార్యాలయ ఆవరణలో గల సమావేశ మందిరంలో గురువారం నిర్వహించిన దర్శి నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, ఎంపీ బీద మస్తాన్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర దేవాంగులు కార్పొరేషన్ చైర్మన్ బి.సురేంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు చేయని విధంగా మన రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. గత సీఎంలతో పోలిస్తే ఎన్టీఆర్, వైఎస్సార్ తర్వాత అత్యంత ప్రజాదరణ పొందిన సీఎం జగన్ ఒక్కరేనని అన్నారు. ఇచ్చిన హామీల్లో 98.44 శాతం అమలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు.

పార్టీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొన్న ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఏ గ్రామానికి వెళ్లినా, ఏ ఇంటికి వెళ్లినా వారికి జరుగుతున్న మేలు గురించి ప్రజలు గొప్పగా చెబుతున్నారని వివరించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం, జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులంతా పాల్గొని మన ప్రభుత్వ హయాంలో ప్రజలకు జరిగిన సంక్షేమాన్ని మరోసారి గుర్తు చేసి వచ్చే ఎన్నికల్లోనూ విజయం సాధించేందుకు కృషి చేయాలని కోరారు.

దర్శి ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ అన్ని వర్గాలకు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించారని తెలిపారు. ప్రతి గడపలో ప్రజలు అపూర్వ స్వాగతం పలకడమే అందుకు నిదర్శనమన్నారు. 2024 ఎన్నికల్లోనూ వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. అనంతరం నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా మాట్లాడి అభిప్రాయాలు సేకరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిశెట్టి రవీంద్ర, రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ వైపీ సుబ్బయ్య, దర్శి, ముండ్లమూరు, తాళ్లూరు ఎంపీపీలు సుధా అచ్చయ్య, ఎస్ఎస్ బ్రహ్మానందరెడ్డి, తాటికొండ శ్రీనివాసరావు, తాళ్లూరు, దొనకొండ జెడ్పీటీసీలు మారం వెంకటరెడ్డి, సుధాకర్‌బాబు, పార్టీ మండల అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీలు సోము దుర్గారెడ్డి, ఐ.వెంకటేశ్వరరెడ్డి, ఎంఎస్‌పీ నాగార్జునరెడ్డి, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఎంఎ ప్రసాద్‌రెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు సానికొమ్ము తిరుపతిరెడ్డి, ఎంపీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షుడు జి.శ్రీకాంత్‌రెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దేవప్రసాద్, సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు షేక్ సైదా, కౌన్సిలర్లు వీసీ రెడ్డి, మోహన్‌రెడ్డి, బాబు, జేసీఎస్ కన్వీనర్లు ఎదురు కోటిరెడ్డి, బత్తిన వెంకటేశ్వర్లు, యాడిక శ్రీనివాసరెడ్డి, మేడికొండ జయంతి, సొసైటీ చైర్మన్ వేమిరెడ్డి చెన్నారెడ్డి, యర్రయ్య, అంబటి వెంకటేశ్వరరెడ్డి, జాన్, డగ్లస్, నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజాప్రతినిధులు, పార్టీ బాధ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



యాగంలో పూజలు చేస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి, ప్రణీత్‌రెడ్డి, శ్రీకావ్య

ఘనంగా మహా రుద్రహోమం

- శ్రీ రాజశ్యామల యాగంలో మూడోరోజు పూజలు నిర్వహించిన బాలినేని దంపతులు

ఒంగోలు టౌన్: స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు నిర్వహిస్తున్న శ్రీ రాజశ్యామల యాగంలో భాగంగా మూడో రోజైన గురువారం అమ్మవారికి ప్రదోషకాల పూజలు నిర్వహించారు. త్రయాహాన్నిక దీక్షలో ఉన్న బాలినేని శ్రీనివాసరెడ్డి దంపతులచే ఉదయం రుద్ర పారాయణ, అనంతరం మహా రుద్ర హోమాన్ని వేద పండితులు మఠంపల్లి దక్షిణామూర్తి చేయించారు. సాయంత్రం శ్రీ రాజశ్యామల హోమం, జయాదులు హోమం, అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ రాజశ్యామలాదేవికి పంచ హారతులు, చతుర్వేద పారాయణ, దర్బారు సేవను ఘనంగా నిర్వహించారు. అమ్మవారి తీర్థ ప్రసాదాలను బాలినేని శ్రీనివాసరెడ్డి, శచీదేవి దంపతులు, బాలినేని ప్రణీత్‌రెడ్డి, శ్రీకావ్య దంపతులకు అందజేశారు. బాలినేని మాట్లాడుతూ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలనే సదుద్దేశంతో మూడు రోజుల నుంచి శ్రీ రాజశ్యామల యాగం చేస్తున్నట్లు తెలిపారు.



యాగంలో బాలినేని దంపతులు

నేడు కంచి పీఠాధిపతి చేతుల మీదుగా పూర్ణాహుతి...

బాలినేని దంపతులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న శ్రీ రాజశ్యామల యాగంలో శుక్రవారం కంచి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి చేతుల మీదుగా పూర్ణాహుతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ప్రజలంతా పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి అనుగ్రహం పొందాలని బాలినేని శ్రీనివాసరెడ్డి కోరారు.

సీఎం సభ విజయవంతం

- సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
- మీడియా సమావేశంలో మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: పట్టణంలోని ఎస్‌వీకేపీ కళాశాల ప్రాంగణంలో బుధవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన ఈబీసీ నేస్తం-2ను ప్రారంభ సభ విజయవంతమైందని మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. అందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. గురువారం మార్కాపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్యే కేపీ మాట్లాడారు. వేలాది మంది ప్రజలు సీఎం సభకు హాజరై జగనన్న ప్రసంగాన్ని ఆసక్తిగా విని సంతోషం వ్యక్తం చేశారన్నారు. ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా, ఏ చిన్న పొరపాటు జరగకుండా సభ జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయడం వలనే సభ సక్సెస్ అయిందన్నారు. సీఎం సభకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వలంటీర్లు, గృహ సారథులు, కన్వీనర్లు, గ్రామ, వార్డు కమిటీల అధ్యక్షులు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ పాలకవర్గం, స్టేట్ డైరెక్టర్లందరూ వచ్చారన్నారు. కలెక్టర్, ఎస్పీ, జేసీ, సబ్ కలెక్టర్, ఇతర అధికారులందరూ సీఎం సభ విజయవంతానికి కృషి చేశారన్నారు. మార్కాపురంతో పాటు గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గ నాయకులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ప్రెస్‌మీట్‌లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి షంషేర్ అలీబేగ్, చైర్మన్ కృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, జెడ్పీటీసీ బాపన్‌రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జవ్వాజి రంగారెడ్డి, కౌన్సిలర్లు బుశెట్టి నాగేశ్వరరావు, సిరాజ్, కృష్ణ, మయూరి ఖాశీం, బాబి, సతీష్, దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ, పాల్గొన్న నాయకులు

ఉత్తమ పోలీసులకు ఉగాది పతకాలు

ఒంగోలు టౌన్: తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పండుగను పురస్కరించుకుని ఉత్తమ సేవలందించిన పోలీసు అధికారులు, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం గురువారం పురస్కారాలు ప్రకటించింది. వారిలో జిల్లాకు చెందిన పలువురు పోలీసులు ఉన్నారు. ఉత్తమ సేవా పతకం పురస్కారానికి పొదిలిలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ షేక్ నాగూర్ మీరావలి, జి.జయరావు (హెడ్‌కానిస్టేబుల్, టంగుటూరు), కె.రమేష్‌బాబు (పీటీసీ, ఒంగోలు)కు ఎంపికయ్యారు. సేవా పతకం పురస్కారానికి మార్కాపురం సీఐ ఎం.బీమానాయక్, గిద్దలూరు సీఐ మొహమ్మద్ ఫిరోజ్ ఎంపికయ్యారు. వీరితో పాటు జి.రవికుమార్ (ఎస్సై, పీటీసీ, ఒంగోలు), ఏ వెంకటేశ్వరరావు (ఏఆర్ హెడ్ కానిస్టేబుల్, ఒంగోలు), పి.రమణారెడ్డి (ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, ఒంగోలు), జి.శ్రీనివాసరావు (ఏఎస్సై, జరుగుమల్లి), కె.లక్ష్మీనారాయణ (ఏఎస్సై, కోర్టు లైజన్, ఒంగోలు) ఎంపికవగా ఫైర్ విభాగం నుంచి కనిగిరి ఫైర్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఫైర్‌మెన్ టి.శ్రీనివాస్ ఎంపికయ్యారు. ఉత్తమ సేవా పతకాలు సాధించిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ మలికాగర్గ్ అభినందనలు తెలిపారు.

బీసీ హాస్టల్‌ను తనిఖీ చేసిన ప్రిన్సిపల్ సెక్రటరీ


అధికారులతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ జయలక్ష్మి

మార్కాపురం టౌన్: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ జి.జయలక్ష్మి బుధవారం రాత్రి మార్కాపురం బీసీ కాలనీలోని ప్రభుత్వ బీసీ కళాశాల బాలికల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడి భోజనం, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం గురించి వివరాలు తెలుసుకున్నారు. నాడు–నేడు కింద నిర్మిస్తున్న ప్రహరీ, మరుగుదొడ్లు, కిచెన్‌ను పరిశీలించారు. ఆమె వెంట సబ్ కలెక్టర్ సేథుమాదవన్, బీసీ సంక్షేమ అధికారిణి అంజల, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు కోటేశ్వరమ్మ, జబ్బార్ తదితరులు ఉన్నారు.

మైనార్టీల సంక్షేమానికి పెద్ద పీట


ఖబరస్తాన్ ప్రహరీని ప్రారంభిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ


ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి సురేష్, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

● రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్
● షాదీఖానాను ప్రారంభించిన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

యర్రగొండపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోందని, మౌలానాలు, మౌజన్‌లకు గౌరవ వేతనం ఇస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. గురువారం స్థానిక మాచర్ల రోడ్డులోని అంజుమన్ ఉర్దూఘర్ షాదీఖానాలో మంత్రి సురేష్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ శాసనసభ్యుడు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. ముస్లిం మైనార్టీలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నియోజకవర్గంలోని పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాల్లో ఖబరస్తాన్‌లకు కాంపౌండ్ వాల్స్, అలాగే షాదీఖానా నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ.. మంత్రి సురేష్ నియోజకవర్గంలో జిల్లా పరిషత్ నుంచి అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు, షాదీఖానా ఆవరణలో షెల్టర్ ఏర్పాటుకు అంచనాలు రూపొందించి పంపితే నిధులు మంజూరు చేస్తానని ప్రకటించారు. ముందుగా రూ.35 లక్షలతో నిర్మించిన షాదీఖానా, రూ.15 లక్షలతో నిర్మించిన ఖబరస్తాన్ ప్రహరీని జెడ్పీ చైర్‌పర్సన్ ప్రారంభించారు.

ఆయా కార్యక్రమాల్లో ముస్లిం పెద్దలు ఎం.కరిముల్లాబేగ్, హిదాయతుల్లా, మహమ్మద్, ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ డి.కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ విజయభాస్కర్, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాష, యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు కె.ఓబుల్‌రెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ సయ్యద్ జబీవుల్లా, శ్రీశైలం దేవస్థానం మాజీ డైరెక్టర్ ఐ.వి.సుబ్బారావు, సర్పంచ్‌లు ఆర్.అరుణాబాయి, డి.సుబ్బారెడ్డి, కర్నాటి వెంకటేశ్వరరెడ్డి, షేక్ కాశింబాష, డీఎల్‌డీవో బి.వి.ఎన్.సాయికుమార్, పంచాయతీరాజ్ డీఈఈ సుబ్బారెడ్డి, పంచాయతీ ఈవో ఈదుల రాజశేఖరరెడ్డి పాల్గొన్నారు.

హనుమంత వాహనంపై రామచంద్రునిగా
చెన్నకేశవుడు


హనుమంత వాహనంపై శ్రీరాముడి అలంకారంలో చెన్నకేశవస్వామి

మార్కాపురం టౌన్:

శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామివారు శ్రీరామచంద్రుని అలంకారంలో హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వైష్ణవ సంప్రదాయంలో ఈ హనుమత్ వాహన సేవను సిరియ తిరువడిగా కీర్తిస్తుంటారని అర్చకులు పేర్కొన్నారు. తొలుత చెన్నకేశవ స్వామికి ఆలయ అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, అర్చక బృందం పుష్పాలంకారం, అర్చన, నివేదన, మంగళహారతి ఇచ్చారు. అనంతరం నాలుగు మాడ వీధుల్లో స్వామివారి నగరోత్సవం నిర్వహించారు.

స్వామివారిని దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు తరలిరావడంతో ప్రధాన వీధులు కిక్కిరిశాయి. పల్లకి సేవలో గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకటరాంబాబు కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ పి.కేశవరావు, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించగా, పలువురు ప్రముఖులు, అధికారులు, భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా కోలాటం, డప్పు వాయిద్యాల ప్రదర్శన భక్తులను ఆకట్టుకున్నాయి.


చందన అలంకారంలో చెన్నకేశవస్వామి మూలవిరాట్

నేడు గరుడ వాహన సేవ

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం గరుడ వాహనంపై శ్రీమహావిష్ణువు అలంకారంలో స్వామి వారు భక్తులకు దర్శనమిస్తారని ఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. భక్తులు నగరోత్సవంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకోవాలని కోరారు.


నగరోత్సవానికి భారీగా హాజరైన భక్తులు

అంబేడ్కర్ తాత్విక సిద్ధాంతమే దేశ సౌభ్రాతృత్వం

● ఏకేయూ వీసీ మారెడ్డి అంజిరెడ్డి


అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏకేయూ వీసీ మారెడ్డి అంజిరెడ్డి

ఒంగోలు: అంబేడ్కర్ తాత్విక సిద్ధాంతమే ఈ దేశ సౌభ్రాతృత్వం అని ఆంధ్రకేసరి వర్సిటీ వైస్ చాన్సలర్ మారెడ్డి అంజిరెడ్డి పేర్కొన్నారు. గురువారం విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో నిర్వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశానికి ఆర్థిక, సామాజిక సమానత్వం లేనిదే రాజకీయ స్వాతంత్య్రం అర్థరహితమన్నారు. వర్సిటీ ప్రిన్సిపాల్ జి.రామమోహన్ మాట్లాడుతూ.. రాజ్యాంగం అమలు చేయడంలో చిత్తశుద్ధి లేకపోతే దాని ఫలాలు అర్హులకు చేరవన్నారు. డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ జి.సోమశేఖర్ మాట్లాడుతూ.. నూతన సామాజిక ఉద్యమ వికాసానికి డాక్టర్ అంబేడ్కర్ శ్రీకారం చుట్టారని, నోరులేని వర్గాలకు నూతన గళంగా నిరుపమానమైన పాత్ర పోషించారన్నారు. డాక్టర్ డి.వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. సామాజిక మార్పు కోసం సమాజాన్ని చైతన్యపరిచిన సాంఘిక విప్లవకారుడు అంబేడ్కర్.. ప్రపంచానికి మార్గదర్శకమన్నారు. విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ మండే హర్షప్రీతమ్ దేవ్‌కుమార్ మాట్లాడుతూ.. అణగారిన వర్గాలకు స్వాతంత్య్రం కంటే ముందు సామాజిక స్వాతంత్య్రం, ఆత్మగౌరవం కల్పించేందుకు కృషి చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్.శ్రీనివాస్, డాక్టర్ ఎ.అమృతవల్లి, డాక్టర్ ఎ.భారతీదేవి, డాక్టర్ ఎస్‌కే హసన్, డాక్టర్ శివాజీ, ఎం.ప్రసన్నకుమార్, స్కాలర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలపై పోరాటం

ఒంగోలు టౌన్: బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించండి, దేశాన్ని రక్షించండిఅనే నినాదంతో శుక్రవారం నుంచి ఈ నెల 30వ తేదీ వరకు దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రచారభేరిని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మల్లయ్య లింగం భవనంలో వాల్‌పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. రానున్న ఎన్నికల్లో బీజేపీని ఓడించడమే లక్ష్యంగా సాగుతున్న ప్రచార భేరి కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. నియోజకవర్గ కేంద్రాల్లో బహిరంగ సభలకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ , సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరవుతారని చెప్పారు. వామపక్షాల నాయకులు జీవీ కొండారెడ్డి, పీవీఆర్ చౌదరి, కంకణాల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు


ఎడ్ల పోటీల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: మార్కాపురం శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని 14, 15, 16వ తేదీల్లో మూడు రోజులపాటు ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, మార్కెట్ కమిటీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం న్యూ కేటగిరీ విభాగం, 15వ తేదీన సీనియర్ విభాగం, 16న పాలపండ్ల సైజు విభాగంలో ఎడ్ల బండ లాగుడు పోటీలు ఉంటాయని వెల్లడించారు. ఆయా విభాగాల పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు బహుమతులు అందజేస్తామని పేర్కొన్నారు. పోటీలు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే కేపీ కొండారెడ్డి, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సారథ్యంలో చైర్మన్ శ్రీనివాసరెడ్డి, తూర్పు వీధి బండ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కొనసాగనున్నాయి. పోటీల వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి గురువారం ఆవిష్కరించారు.

బహుమతుల వివరాలు

న్యూ కేటగిరీ విభాగంలో గెలుపొందిన ఎడ్లకు మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరు బహుమతులను వరుసగా రూ.50 వేలు, రూ.35 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.8 వేలు, అలాగే సీనియర్ విభాగంలో గెలుపొందిన ఎడ్లకు వరుసగా రూ.80 వేలు, రూ.50 వేలు, రూ.35 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, పాల పళ్ల సైజు విభాగంలో గెలుపొందిన ఎడ్లకు వరుసగా రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.7 వేలు అందజేస్తామని నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి, పాపిరెడ్డి, శివారెడ్డి, గాలిరెడ్డి, రమణారెడ్డి, వెంకటరమణారెడ్డి, సత్యనారాయణరెడ్డి, చెన్నారెడ్డి తెలిపారు. పోటీల్లో పాల్గొనే ఎడ్ల యజమానులు ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 96421 86379, 99663 53300ను సంప్రదించాలని కోరారు.

ఓటరు దరఖాస్తులు వేగంగా పరిష్కరించాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్


రాష్ట్ర ఎన్నికల అధికారి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులకు సంబంధించి పెండింగ్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. ఓటరు జాబితా సవరణలు, ఎన్నికల పిటిషన్లు, ఓటరు గుర్తింపు కార్డులు తదితర అంశాలపై ముఖ్య ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా గురువారం జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ శ్రీలత ఇతర అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ వివరించారు. ఈ ఏడాది ఏప్రిల్ 12వ తేది నాటికి 17,78,237 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. పీవీసీ ఓటరు కార్డులను స్పీడ్ పోస్టు ద్వారా పంపేందుకు చిరునామాలు సరిగా లేనందున ప్రభుత్వ సిబ్బందితో పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.1.90 కోట్ల బిల్లులు మంజూరు చేయాలని కోరారు. అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఎలక్టోరల్ పాపులేషన్ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తక్కువగా ఉన్న యర్రగొండపాలెం, ఒంగోలు నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అర్హులందరినీ ఓటర్లుగా చేర్పించేందుకు ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని చెప్పారు. సమావేశంలో ఒంగోలు ఆర్డీఓ విశ్వేశ్వరరావు, కనిగిరి ఆర్డీఓ అజయ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీల్లో మెరుగైన వసతులు


విద్యార్థులతో మాట్లాడుతున్న జీసీడీఓ మాధవీలత

కొనకనమిట్ల: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని జీసీడీఓ మాధవీలత పేర్కొన్నారు. గురువారం సాయంత్రం ఆమె గొట్లగట్టు కేజీబీవీని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. నాడు–నేడు కింద జిల్లాలోని కేజీబీవీలకు ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసిందని తెలిపారు. పాఠశాలలో నిర్మిస్తున్న లైబ్రరీ, అదనపు తగరతి గదులు, వాటర్ ప్లాంట్, మరుగుదొడ్లను పరిశీలించారు. రికార్డులు పరిశీలించి ప్రిన్సిపాల్ సురేఖ, ఉపాధ్యాయులకు సూచనలిచ్చారు. మెనూ ప్రకారం రుచికరమైన భోజనం అందించాలని కుకింగ్ ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు.

క్లుప్తంగా

బాలుడి హత్య కేసులో నిందితురాలికి జీవిత ఖైదు


పిన్నిక ధనుంజయ (ఫైల్)

చీమకుర్తి/ఒంగోలు/ఒంగోలు టౌన్: పాత కక్షలను మనసులో పెట్టుకుని నాలుగేళ్ల బాలుడు పిన్నిక ధనుంజయ ప్రాణం తీసిన వేల్పుల జ్యోతికి గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి జీవిత ఖైదు, రూ.5 వేలు జరిమానా విధించారని చీమకుర్తి ఎస్సై జి.రమేష్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. చీమకుర్తి మండలం పిడతలపూడికి చెందిన పిన్నిక సంధ్య, వేల్పుల జ్యోతి కుటుంబాల మధ్య పొలం విషయంలో వివాదం తలెత్తింది. ఈ క్రమంలో 2017 అక్టోబర్ 27వ తేదీన సంధ్య నాలుగేళ్ల కుమారుడు అంగన్‌వాడీ పాఠశాలలో ఉండగా వేల్పుల జ్యోతి అనే మహిళ కుర్‌కురే ప్యాకెట్లో ఎలుకల మందు కలిపి తినిపించి నీరు తాగించింది. దీంతో ఆ బాలుడు తీవ్ర అస్వస్థతకు గురై గుంటూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై చీమకుర్తి పోలీసుస్టేషన్‌లో 2017 అక్టోబరు 28న అప్పటి చీమకుర్తి ఎస్సై జీవీ చౌదరి కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం సీఐ మురళీకృష్ణ కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వేల్పుల జ్యోతిపై నేరం రుజువు కావడంతో ఆమెకు యావజ్జీవ జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ నారపరెడ్డి వసుంధర వాదించారు. కాగా నిందితుడికి శిక్ష పడేలా సమర్థవంతంగా ట్రయల్ మానిటరింగ్ చేసిన అప్పటి సీఐ మురళీకృష్ణ, కోర్టు లైజన్ హెడ్‌కానిస్టేబుల్ రాఘవరావు, చీమకుర్తి కోర్టు కానిస్టేబుల్ హరికృష్ణను ఎస్పీ మలికాగర్గ్ ప్రత్యేకంగా అభినందించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి


మృతుడు విక్టర్ ఇమ్మానియేల్

ఏలూరు టౌన్: ఏలూరు గన్‌బజార్ రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మార్కాపురం మండలం గజ్జలకొండ గ్రామానికి చెందిన జమ్ముళ్ళమూడి విక్టర్ ఇమ్మానుయేల్ (24) ఏలూరు శివారులోని ఆశ్రం ఆసుపత్రిలో శానిటరీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. అతను బుధవారం అర్ధరాత్రి ఏలూరు గన్ బజార్ సమీపంలో రైలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు బండి ఢీకొనడంతో మృతి చెందాడు. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం బంధువులకు అప్పగించారు.

చిలకలూరిపేటలో జిల్లా వాసి ఆత్మహత్య


ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న వాసుబాబు

చిలకలూరిపేట టౌన్: పట్టణంలోని నరసరావుపేట సెంటర్లో ఉన్న ఏటీ లాడ్జిలో ఓ వ్యక్తి ఉరివేసుకుని మృతి చెందాడు. మృతుడు ప్రకాశం జిల్లాకు చెందిన వాసుబాబుగా పోలీసులు గుర్తించారు. కొద్దికాలంగా చిలకలూరిపేట పట్టణంలోని రెడ్ల బజారులో నివాసం ఉంటూ యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామంలోని ఓ నూలుమిల్లులో పనిచేస్తు జీవనం సాగిస్తున్నాడు. అయితే కుటుంబ కలహాల నేపథ్యంలో వాసుబాబు ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు భావిస్తున్నరు. మరిన్ని వివరాలు పోలీసులు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

98 డీఎస్సీ అభ్యర్థులకు
కౌన్సెలింగ్

పోస్టింగ్ ఆర్డర్లు అందుకున్న అభ్యర్థులు వెంటనే విధుల్లో చేరాలని డీఈఓ సూచన


పోస్టింగ్ ఉత్తర్వులు అందిస్తున్న డీఈవో రమేష్

ఒంగోలు: స్థానిక ప్రకాశం భవనంలోని స్పందన సమావేశ మందిరంలో 1998 డీఎస్సీ అభ్యర్థులకు గురువారం రాత్రి కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 165 మందిని ఆహ్వానించగా, 157 మంది హాజరయ్యారు. రాత్రి 11 గంటల తర్వాత కూడా కౌన్సెలింగ్ కొనసాగింది. డీఈవో రమేష్, ఏడీ సురేఖావాణి పర్యవేక్షించారు. పోస్టింగ్ ఉత్తర్వులు అందుకున్న వారు వెంటనే విధుల్లో చేరాలని డీఈవో పి.రమేష్ ఆదేశించారు.